కవితా కౌముది

# మనిషి ఓ మాంసపుముద్ద

శ్రీసాహితి

మనిషి ఓ మాంసపుముద్ద....

★ ★ ★ ★ ★

ఏదో ఒక బాధ రాపిడికి
గొంతు చిరిగి
అర్థం చితికి

ఇష్టాలకు విలువండక
నమ్మకాలు నిలువలేక
చావు తెలిసొస్తుంది.

★ ★ ★ ★

చల్లారిన ఊపిరితో
మనిషికి శవమన్న
అంతిమ గౌరవంతో

స్పందనలుండక
రాయబారల్లేక
బతుకు ముగిసేపోతుంది.

★ ★ ★ ★

ఊపిరికి
కళ్ళు, చెవులు, గొంతు
బానిసలు

చావుకు
సంతోషం ,నిద్ర, ఆకలి
సమాధులు

జీవితంలో ముసుగు పాత్రలతో
బతుకంతా మగత నడకలే
విషాదంతాలే...

నిత్యం పొంచిచూసే
మనసనే రుచి లేని
మనిషి ఓ మాంసపుముద్ద....

చివరకు
నంజుకుతింటాడు.
తినబడతాడు అంతే...

★★★★



# ప్రవాసీయం

రామ్ డొక్కా

నడిసంద్రంలో
ఈదడం నేర్చుకొన్నాను,
ఏ తీరమైనా నాకొకటే..

విశ్వమంతా
నా ఇల్లే అనుకొన్నాను,
అందరూ నా వాళ్ళే..

పలుకు
నీకు పూబోణి కావచ్చు,
నా తల్లి పాదాల పారాణి!
పరమపవిత్రంగా చూసుకొంటాను..

మాట
నీకు తంత్రం కావచ్చు,
నా మనసు జపించే మంత్రం!
మర్యాద కాపాడతాను..

పద్యం
నీకు చెల్లని నాణెం కావచ్చు,
నాకు ఆరవ ప్రాణం!
బ్రతుకును సమర్పించుకొంటాను..

భాష
నీకు వృత్తి కావచ్చు,
నాకు సత్ప్రవృత్తి!
నిత్యం ఆరాధించుకొంటాను..

సాహిత్యం
నీకొక శాలువా కావచ్చు,
నాకు బాధ్యత!
పరిరక్షించుకొంటాను..

సంస్కృతి
నీకు వ్యాపారం కావచ్చు,
నాకు సదాచారం!
పరివ్యాప్తం చేసుకొంటాను..

దేశభక్తి
నీకొక ఎజెండా కావచ్చు,
నేనే నా దేశపు జెండా!
ఎక్కడ నాటినా రెపరెపలాడతాను..

★★★

# మౌనఘోషితా..!
# సుజాత పి.వి.ఎల్

ఉల్కలు ఉత్పాత వర్ణాలుగా
తారలు తారాజువ్వల్లా మెరుపు వేగంతో ఉరుముతూ
ఆలోచనలు ఉరకలేస్తుంటే
మనసు స్థిరంగా ఉంటుందా?
ఒక్కోసారి అనిపిస్తుంటుంది..
మది మూగైనా భావుణ్ణు..
మౌన ప్రదర్శనలో విజేతగా నిలిచేదేమో..
కోర్కెలు రెక్కలు విప్పుకొని
ఎగిరే పక్షుల్లా
స్వేచ్ఛా స్వాతంత్ర్యాన్ని
రెపరెపలతో గుర్తుచేస్తుంటే..
తలవంచుకొని నిశ్శబ్దంగా ఉండటం
ఎలా సాధ్యం?
అందం ఆకాశాన్నంటిందన్న పొగడ్తే..
పంజర విముక్తికి దారి తీసిందా?!
ఏడడుగుల నడకతో
ఆరంభమవ్వాల్సిన జీవితం
అర్ధాంతర పయనంతో ఆగిపోయేలా చేసిందా?
ఇదేమిటని ప్రశ్నించే అర్హతను
పూర్తిగా కోల్పోయిందనుకుంటా..!

నాడు అంతా మెచ్చుకున్న
ఆవేశ అభివర్ణం
నేడు కళ తప్పి
కలలను కరిగించి
కన్నీళ్ళ జడివాన కురిపిస్తోంది..
విశాల గగనం
వికృతరూపం దాల్చి
తారలా మెరవాలనే
తప్పిదాన్ని వేలెత్తి
చూపిస్తున్నట్టనిపిస్తోంది..
మౌనఘోషిత గర్జనల మదుపుతో
మరొకరు ఇలా కావొద్దని
అదుపు హెచ్చరిస్తుంది..
నయనం నిలదీసే
ప్రతిస్పందనలో
కవనం ప్రతిధ్వనిస్తోంది.

★★★

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

చెట్టుకొమ్మలలోనుండి చెవుల తాకు
శ్రావ్యముగ మృదుగీతికారవములెన్నొ
ఏ విహంగములో యింకనెన్ని గలవొ
ఏల పాడుచున్నవో యెవరి కొరకొ

పాదచారులకు పలుకు స్వాగతమ్మొ
వెడలిపొమ్మంచు చేసెడి విన్నపమ్మొ
మధురగానాబ్ధి మున్గు తన్మయము కొరకు
వలయునేకాంతమెవరు రావలదనేమొ

గగనతలమెల్ల నిండునీ గానలహరి
చెవుల తాకిన ప్రతిజీవి చిత్తమలరు
విసుగును విరామమును లేక విహగతతులు
పాడు తమ తృప్తి కొరకు, విశ్వమ్ము కొరకు

చెంతకేగిన పులుగులు చెదరునేమొ
దవ్వుననె యుండి వినుటయే తగును మనకు
చేరబోవక విన్న హర్షించునెడద
అద్భుతానందకరమీ రసానుభవము

అబలలీ విహగములెట్టులాదుకొనును
కాచి కాపాడుచున్న వృక్షములనెల్ల
తాకి తొలగించు కఠినాయుధములనుండి
అభయమొసగుట మనకు సాధ్యమ్ము కాదె!

COMMENTS